# ఒరేయ్ వెంకటచలం

నేను రైలుపెట్టె యెక్కీ యెక్కడంతో ఓ మూలనించి,

"ఒరేయ్!" అని కేక వినపడ్డది.

నన్ను ఒరేయ్ అని పిలిచే వాళ్ళిద్దరే వున్నారు లోకంలో. వాళ్ళు నాకు ప్రేమాస్పదులైనందువల్ల సంతోషంతో తలెత్తి చూశాను. నాకేసి పరమానందంతో చూస్తున్నాడు, తెలిసినవాడు దొరికాడు కదా అన్నట్టు. ఆయె నెవరో నాకు తెలీదు, నన్నేనా అని అనుమానపడుతున్నాను.

"ఇట్లారా, చోటుంది యిక్కడ," అంటున్నాడు పైగా,

ఇన్నేళ్లూ నన్ను వెతికిన బంధువు డెవరన్నా దూర దేశంలో చూచిన ప్రేమచేత పలకరిస్తున్నాడా యేం? అనుకుని వెళ్లాను. ఒక ట్రంకుని బల్లమీదనించి తీసి, ఓ గుజరాతివాణ్ణి మనిషికి కావలసినంత స్థలమే ఆక్రమించుకునేట్టు తోసి నాకు చోటు వేశాడు.

"అట్లా చూస్తావేం? నన్నెరగవూ?"

రైలెక్కగానే బంధువుకు దొరికిన నా అదృష్టానికి గావును, అందరూ నావంక చూస్తున్నారు. లోకంలో కల్లా నాకు యిబ్బందైన విషయం రైలుపెట్టెలో అందరూ నా వంక చూడడం.

ఈయన్ని "నువ్వు" అనాలో, "మీరు" అనాలో తెలీదు. ఇంత పెద్ద రైల్లో యీ పెట్టె నాకు ఎట్లా తటస్థపడ్డది?

"ఎరక్కేం?" అన్నా.

"ఐతే నే నెవరు?"

నామీద అంత నమ్మకం లేకపోతే, నన్ను పిలిచి పక్కన కూచోపెట్టుకోమన్న దెవరు?

ఏం చెయ్యను?

"మరిచిపోయినాను."

"నిజం చెప్పు"

అసలు యెరగనేమో!

"తెలీదు"

"ఈ డాబుల కేంలే! నువ్వు నన్నెరక్కేం?"

"ఐతే జ్ఞాపకం రావటంలేదు"

పెట్టంతా అదిరేట్టు నవ్వాడు.

"నన్నెరగవులే, నిన్ను నే నెరుగుదును."

ఎవరో చెప్పు అని ప్రశ్న వేస్తాడేమో ననే ఆశతో ఆగాడు. నేను కొత్తచెప్పు కాల్ని కరిచినచోట చూసుకుంటున్నాను.

"ను వ్వెవరో చెప్పనా?"

చూస్తున్నాను. మతి సరిగా వుంధా యీ యనకి? అని వొద్దని యెట్లా అనను?

"నువ్వు వెంకటచలం"

"కాదండీ, నేను సూర్యనారాయణని"

"డాబులు కొయ్యకు. నువ్వు వెంకటచలం"

"ఏ వెంకటచలం?"

"ఇం కెవడు? కథలువ్రాసే వెంకటచలం."

"కాదండి, ఆయన్ని నే నెరుగుదును."

"ఈ మాటల కేంలే! నిన్ను ను వ్వెరగవా?"

నన్ను ఎగాదిగా చూశాడు.

"ఒరే! ఏమిత్రా ఆ కథలూ నువ్వేనూ?"

"నాకు తెలీదండి ఆ కథల సంగతి."

"ఆ సంగతి సరేలే....జరిగాయే అనుకో. జరిగినంత మాత్రాన వ్రాయాలా? తప్పు కాదూ? భోజనం చేశా మనుకో, తరవాత సంగతి కూడా వ్రాసుకుంటారా?"

"న న్నడుగుతా రేమిటి?"

"ఆ సంగతి సరేలే. వ్రాశావనుకో, ఏ మంటావు?"

"ఆర్టు."

"ఆర్టు సరేలే, వ్రాయవొ ద్దనలేదు. జరిగినవి వ్రాయడం ఎందుకు?"

చూస్తున్నాను అర్థంగాక.

"పాపం వాళ్ళ మనసులు నొచ్చుకుంటాయా లేదా?"అన్నాడు, నిట్టూర్పు విడిచి.

"ఎవరి మనసులు?"

"ఆ ఆడపిల్లలవి?"

"ఏ ఆడపిల్లలవి?"

విసుక్కున్నాడు.

కొడతా డనుకున్నాను.

"అదేరా. ఏదో నిన్ను నమ్మి వొచ్చారనుకో. వొస్తే? బట్ట బయలు చెయ్యాలా?"

"ఆడపిల్ల లెవరు? నన్ను యిష్టపడి రావడ మేమిటి?"

అంత అదృష్టమా అనుకున్నాను, స్వగతంలో.

"తెలుసులేరా? ఇంక అట్లాంటి పనులు మానుకో" అని

ఆలోచనగా, 'వీలో యేంచూసి వొచ్చారో?' అనుకున్నాడు నన్ను బాగా పరిక్షిస్తో.

"ఎవరూ రాలేదు రారు."

"మరి వొప్పుకుంటా వనుకున్నానా? నాకు తెలుసులేరా!

"బాగానే వ్రాశావుగాని, నువ్వు వ్రాసినవి ఒకలెఖ్ఖాజమా? ఈనాడు అసలు రొమాన్సు అనేదివుందా? ఒరే, యిప్పు డున్న గల్లా రొమాన్సు కావాలనే ఆశవల్ల పుట్టిన జాడ్యం. అంతేకాని - చూడు. యీ కొత్త ఆడపిల్లలు-ఎవరి వెంట పడుతున్నా రంటావు?-యీకొత్త కాలేజీ కుర్రాళ్ళ వెంట. కవిత్వాలూ, కధలూ, వ్రాసే కుర్రకుంకల వెంట. వొరే! కథ చివరిదాకా వ్రాసేందుకు కలంపట్టుకునే బలంలేదే, వీళ్ళకి! కథలు వ్రాసినవాడు కథలో మల్లె చెయ్యగలడనే యీ వెర్రి

గుంటల పుద్దేశ్యం? పొడుగుజుట్టూ, ఫ్రెంచి మీసాలూ, స్నోలూ, వాల్లెవాట్లూ, యీవీ యీనాటి పురుషలక్షణాలు. చొక్కా కింద వెమికలకుప్పలు. ఏదీ నీచెయ్యి? చూడు, ఏమూలన్నా, ఒక్క రవ్వ కండ........"

కుయ్యిమని చెయ్యి లాక్కున్నాను.

"ఏం చేస్తున్నావురా, యిన్నాళ్లూ, యిన్నేళ్లూ! ఏమిటా పుస్తకం!....షా........అంతే.షాలూ, లారెన్సులూ చదువుతున్నావు, నీ బతుకంతా, మరి యీ పుస్తకాలతోనే పూరేను. ఆడపిల్ల లెందుకురా నీకు? ఏం చేసుకుంటావురా? వాళ్ళనీ విప్పి చదువుకుంటావా? ఏం చేస్తారు? రాత్రంతా 'షా' చదువుకుని, స్త్రీలకి స్వతంత్రం లేదని తర్కిస్తారా? ఈ సంఘాన్ని సంస్కారం ఎట్లా చెయ్యాలా; యేకాన్ఫరెన్సులు పెట్టాలా, ఏం లెక్చర్లియ్యాలా అని యోచిస్తారు తెల్లార్లూ-ఒకే పక్క మీద కూచుని. ఓరి జోగుల్లారా? ఎందుకురా స్వతంత్రం మీకు. ఓ మొగుడూ, ఓ పెళ్ళాం చాలరట్రా మీ బతుకులకి?"

ఆగాడు. చుట్టూ చూశాడు. ఎక్కడికన్నా పోదామని స్టేషను వాస్తుందేమోనని కిటికీ లోంచి నేను చూస్తున్నాను. పోతే తంతా వంటే........

"నీ యీ డున్నప్పుడు-ఇట్లా చూడు, నా జబ్బపట్టి చూడరా"

"నాకు మొగవాళ్ళని తాకడం బావుండదు"

ఏం చెయ్యను?

"ఇంకావొత్తు-అంతేనా?"

బిగ్గరగా నవ్వాడు.

"చూశావా? నీ యీ డున్నప్పుడూ, పరుగెత్తే దున్నపోతు తోక పట్టుకు వెనక్కి లాగితే, దున్నపోతు ఆగేదిరా. మరి నువ్వు ఎప్పుడన్నా దండేలు తీశావా? చెడుగుడి ఆడావా? మరి ఏం చేస్తున్నావు? ఓ మైలు పరుగెత్తుతావా? పరీక్షలు పాసవుతున్నావు. Love letters వ్రాస్తున్నావు. రోడ్డుమీద ఆడపిల్ల కనపడితే వెంటపడతావు—మరి

ఎవరన్నా తన్నవొస్తే పరిగెత్తకలవ్వా? రాత్రిపూట మూడడుగులగోడ దాటగలవురా? ఇంకేం రొమాన్సురా నీకు? నీ మొహం.''

అది మహారాష్ట్రదేశం గనక తెలుగు తెలీదుగనక సరిపోయింది. తెలుగు రైలుపెట్టెలో అట్లా అరిచి ఆ మాటలంటో వుంటే నన్ను!....

''టెన్నిసన్ కవిత్వం, హానిబాల్ శౌర్యమూ, కృష్ణదేవరాయడి బలమూ. కాళిదాసు రఘువంశమూ, మీ కాలేజి పార్లమెంట్లూ, స్వరాజ్యం—జపాన్ వాడితో నువ్వేరా పోట్లాడేది?''

ఆగి చుట్టూ చూశాడు. వాళ్లెవళ్ళన్నా పోట్లాడగలరేమో అన్నట్టు.

''ఇంత చాతకాని వాళ్ళు గనుకనే కొత్తథియరీలు పెట్టారు— చూస్తోనే వున్నానురా, మీ వ్రాతలూ-ఆధ్యాత్మిక ప్రేమలూ, ప్లేటోనిక్ లవ్‌లూ, మానసిక సానుభూతీ, పవిత్రతా, కళా వుపాసనా-మీ వ్రాతలట్లా వున్నాయి గనకనే మీ రాత లిట్లా యేడిశాయి''

''వెంకట చలంగారు వాటిని వొప్పుకోరండి''

''నువ్వు వొప్పుకోవులే. కాని నువ్వుమాత్రం-విన్నావూ, ఆ షికార్లూ, నవ్వులూ, టీపార్టీ, బోట్లమీదా రైళ్ళమీదా గెంతడాలూ ....ఆడపిల్లల్ని రోడ్లమీద తిప్పడమెందుకురా! అలిపిపోవాలనా? అవునులే, అంతకన్న చాత కానప్పుడు ఏం చేస్తావులే!

ఒరే నామాట విని ఆ కథలు మానెయ్యి. ఎందుకురా నీ అనుభవాలూ నువ్వూను. నన్నెరుగుదువుగా!''

''అవన్నీ వూహించి వ్రాసినవండి. ఆయన అనుభవాలు కావు. అయన్నెరుగుదును నేను''

''సరేలే, ఎవరిముందన్నా బొంకుగాని, నా ముందుకాదు. నాకు తెలీని దేమీ లేదు. మహామహావాళ్ళని చూశాను. ఏం తెలుసురా నీకు? ప్రేమంటే నీకేం తెలుసు? నన్నడుగు చెపుతాను. ఎప్పుడన్నా మావూరురా, నేను దాచిన వుత్తరాలు చూపుతాను. ఫోటోలూ వున్నాయిరా! నేనే కథలు వ్రాస్తేనా! ఇట్లాంటి ఆడవాళ్ళా? ఇంతంతకళ్లూ, ఇంతజుట్టు, ఇంతంత—''

వెళ్ళిపోతోంది ప్రవాహం. నుంచున్నాడు. ఆజుట్టునీ కళ్ళనీ

చేత్తో చూపుతో వర్ణిస్తున్నాడు. పెట్టెలో వాళ్లు తెలుగు వాళ్ళు హిందీ ఫిల్ముని చూసినట్లు చూసి ఆనందిస్తున్నారు. ఒకళ్ళిద్దరు లేచి ఆడడానికి సిద్ధమయ్యేట్లున్నారు. "పాటపాట" అంటారు కొంతసేపు పోతే, ఇదేం ఖర్మం నాకు?

"మ రెవరో చెప్పారు కారు?"

"నేనా?" కూచున్నాడు. "న న్నెరగవూ ?"

"ఎరగను"

"ఎరక్కేం. నేను యవ్వనంలో వుండగా ప్రతి పత్రికలోనూ నాఫోటో వెయ్యమని యీ పత్రికలవాళ్ళని ఆశ్రయించే వాణ్ణా నీకు మల్లె. వాళ్ళే నా గుమ్మంముందు పడివుండే వాళ్ళు, ఏమనుకున్నావో! విన్నావుగా? వజ్రేశ్వరశర్మ నా పేరు.

"మీరా అండి! చిన్న కుర్రాణ్ణి నేను, మీరు మాకాలేజీలో డిమాన్‌స్ట్రేషన్ యిచ్చినప్పుడు........"

నాకు జ్ఞాపక మొచ్చింది, అపటం.

చెయ్యి కదిల్చినా, కాలు కదిల్చినా తాచుపాముల్లాగ పెనవేసుకునే నిగ నిగలాడే కండలు చల్లని చర్మంకింద వుబ్బి కళ్ళను చెదరగొట్టే బలం........

అంత "రాట్" ఆయన మాట్లాడినా, నాకు అద్భుతమైన అభిమానం కలిగింది. శరీరబలానికి ప్రజలు యిచ్చే అప్రయత్నమైన గౌరవం.

"ఎరుగుదువుకద! మాకాలంలోనా? ఈ షికార్లూఈ కవిత్వాలూ ఏం లేవు. ఒక్క చూపు ఒక్క మాట-చాలు-ఈ టీలకు పిలవడాలూ, యీ పేర్లులేని చీట్లూ, యీ పుస్తకాల్లో పద్యాలకి పెనసలుగీట్లూ, యీ గూఢకవిత్వాలూ, భావగీతాలూ, భావోద్రేక కథలూ, ప్రేయసులూ, హంసలూ, కోతులూ, కోవెలలూ,—ఏమీ లేవు. అసలు మా పనేమిటో అది జాగ్రత్త పడే వాళ్లం. కోవెలలూ, మందమారుతాలూ వాటి జాగ్రత్త అవి పడేవి. వెతకడాలూ, చుంబనాలూ, మా చాతకావు.

ఎందుకురా వెధవ చదువులు! పదిగారెలు తినలేని, యిద్దరు ఆడవాళ్ళకి జవాబు చెప్పలేని చదువులు యెందుకురా అవి? ఆ జాగ్ర

ఫీల బదులు దేశమంతా తిప్పకూడదూ? అహింసరీ బదులు పాత నాట్యాలకోసం గోతులు తవ్వితే, వృక్ష శాస్త్రం బదులు దున్నితే జంతు శాస్త్రం బదులు గాడిదల్నెక్కితే, గంటకి యెన్ని దండేలు తియ్యగలరో ఆ లెక్కలు చెపితే బాగుపడతారు మీరు. బైరన్ చదివి, ఎంకిపాటలు పాడి "షా"ని కోట్ చేసి, కథలు రాసి, ఆడపిల్లల్ని మరిగించి, తీరా భ్రమసి వాస్తే నువ్వుజేసే దేమిట్రా? ఒకటిన్నర తులం తౌడు బిస్కటుముక్కా, అరకప్పు టీ యాస్తావా వొయ్యారంగా? తీరా సమయం వొచ్చేప్పటికి మే మ్మె మ్మా అనడం - లేకపోతే ప్రేమమీద లెక్చరుకొట్టడం, తప్పించుకు పారి పోవడం. అయితే యింకోటిలే—ఈ నాటి ఆడపిల్లలూ అట్లానేవున్నారు. చప్పిదవడలూ, కాలికీ కంటికీ జోడూ, వొంగిన నడుములూ, పూచలాంటి చేతులూ - ఎందుకురా వాళ్లూ?.... అన్నీ వున్న పిల్ల ఒక్కత్తె కనబడదే, వొడ్డి వాళ్ళలో తప్పు! సరిపోయినారులే ఒకరికొకరు!"

"ఇదేనా షోలాపూరు?"

రైలు వేగం తగ్గించింది. ఆయన లేచి నులుగురి మీదనుంచి పెట్టా పక్కా సద్దుతున్నాడు. మాటలు మాత్రం ఆగలేదు.

"అయినా బొంబాయి యెందుకు నువ్వు? ఆంధ్రదేశం. చాలలేదూ? విన్నాలే! ఆ మైసూరుపాకు సంగతి—ఏం?"

"ఏమి టది?"

'తెలీనట్టు చూడకు. చేసి పైగా దొంగచూపులు పెడతావా? ఆ వెధవ వేషమే మండుకొచ్చేది. మనలో మనకేం? వొప్పుకో కూడదూ అంతమాత్రం? ఆ కాపీహోటలువా ళ్ళేమన్నారు? చెప్పు హ, హహ "ఆంధ్రదేశం చాలదా, మైసూరు మీద పడ్డాడా?" అన్నారటగా! బలే వాడివి."

"అ దేదో వెంకటచలంగా రేమో, నాకు తెలీదు."

"ఒరే, అబద్ధం చెపితే, "జోక్" కాసేపు. పొద్ద స్తమానం అదేమాటా? అందుకునే మండుకొస్తుందియీ కుర్రాళ్ళతో మాట్లాడం. పిరికివెధవలు—ను వ్వేదో నయ మనుకున్నా కథల్లో వీ డాబులు చూపి. అందరికన్నా అన్యాయంనువ్వు .సరేలే, బొంబాయిలో జాగర్త.

తన్నులు తినేవు! మొగాళ్ళు కాదు, ఆడవాళ్లే తంతారు. ఆంధ్రులకు అప్రదిష్ట తేకు."

రైలాగింది. సామాన్లు దించుకుంటున్నాడు. చప్పున యేదో జ్ఞాపకం వొచ్చి తలుపుదగ్గిర్నించే "ఒరేయ్" అన్నాడు.

ఆ అరుపుకి ముగ్గురు పోర్టరులూ, ఒక గుమస్తా, రెండు కుంటి కుక్కలూ ఆగాయి ఆపెట్టెదగ్గిర.

"అయినా ఆ యూరేషియను పిల్లతో నీ కేం పనిరా? కంపు ఉగా వాళ్ళదగ్గిర?"

"నాకేం తెలుసు?"

"ఇంత పిరికి వెధవ్వి అనుకోలేదు. ఎంత మోసపోయానాను!"

'నేనా వెంకటచలం కాదండి."

"కాదూ! ఎవరు నమ్ముతారు!"

మీరు నమ్ముతారా అన్నట్టు బండిలోవాళ్ళనీ, స్టేషన్‌లో వాళ్ళ వంకా చూశాడు.

బండి సాగింది.

నేను నిట్టూర్పు విడిచి, ఆలోచిస్తున్నాను.

---